
## పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సామాగ్రి, సిబ్బంది


పోలింగ్ కేంద్రంలో సిబ్బంది

**చిన్నశంకరంపేట, మే 12,ప్రభాతవార్త:** సార్వత్రిక ఎన్నికలు సోమవారం జరగనున్న నేపథ్యంలో మండలంలో నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. సామాగ్రి చేరుకుంది. పోలింగ్ శాతం పెంచేలా, ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ నిర్వహించేలా అధికారులు చర్యలను తిసుకున్నారు. ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఓటర్ స్లిప్పులను ఇంటింటికి అందచేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద వృద్దులకు, వికలాంగులకు అన్నిసౌకర్యాలు కల్పించామని అధికా రులు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త


## శాశ్వత అన్నదాన పథకానికి విరాళం అందజేసిన భక్తుడు


విరాళం అందించి రశీదు తీసుకుంటున్న దృశ్యం

**కొమురవెల్లి, మే 12, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన రాజు పోషకులుగా, శాశ్వత అన్నదాన పథకం కింద విరాళంగా పులిపాక దేవమణి అర్జున్ దంపతులు మల్లికార్జున స్వామి దేవాలయానికి విరాళంగా ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్‌కు నగదు ఇచ్చి రశీదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మహాదేవుని మహేష్, జూనియర్ అసిస్టెంట్ మధుకర్, బుకింగ్ క్లర్క్ మాధవి తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

## పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి
### జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**జహీరాబాద్, మే 12, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఎన్నికల సమాగ్రి పంపిణి కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సందర్శించారు. పంపిణీ కేంద్రం నుంచి ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు తరలించే సామాగ్రిని ఎన్నికల సిబ్బందికి పంపిణి చేస్తున్న సామాగ్రి (ఈవీఎ, వివి ప్యాడ్లలను) కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్ల గురించి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఓ ఎస్ రాజును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పోలింగ్‌కు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు.

## ఓటింగ్ సమాచారం త్వరగా అందించాలి
### -జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్


సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ మున్సిపాలిటీ, మే 12 ప్రభాతవార్త:** పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సమాచారం త్వరగా అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ సిబ్బందికి సూచించారు. ఆదివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో సిబ్బందితో మాట్లాడుతూ నేడు జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం, ఓటర్ల హాజరు సమాచారం, త్వరితగతిన ఉన్నత స్థాయి అధికారులకు అందించాలని, ప్రతి రెండు గంటలకు ఒకసారి ఓటర్ల హాజరు, పోలింగ్ శాతం పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏవో యునాస్, ఎలక్షన్ సూపరింటిండెంట్ హర్దీప్‌సింగ్, ఈడీఎం సందీప్ పాల్గొన్నారు.

## ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో సర్వం సిద్ధం


పోలింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

**చౌటకూరు, మే 12, ప్రభాతవార్త:** ఈ నెల 13న జరిగే జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని పోలింగ్ నిర్వాహణకు సంబంధించి తగు ఏర్పాట్లు పూర్తిచేశారు. నియోజకవర్గంలోని 9 మండలాల్లోని 313 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సిబ్బందిని అదనపు కలెక్టర్ మాధురి, అందోల్-జోగిపేట ఆర్‌డిఓ పాండుల పర్యవేక్షణలో ఆదివారం పోలింగ్ నిర్వాహణ బాధ్యతలు అప్పగించారు. మండలంలోని సుల్తాన్‌పూర్ వద్ద జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంల నుంచి పోలీసు బందోబస్తు మధ్య వాహనాల్లో పోలింగ్ సామాగ్రిని(ఈవీఎం, వివిప్యాడ్‌లు) పోలింగ్ కేంద్రాలకు సిబ్బందికి అప్పగించి తరలించారు. నియోజకవర్గంలోని 313 పోలింగ్ కేంద్రాలకు 1472 మంది పోలింగ్ సిబ్బంది, 57 మంది మైక్రో అబ్జార్వర్లను, 35మంది సెక్టార్ అధికారులను నియమించారు. పోలింగ్ సరళిని పర్యవేక్షణకు 313 పోలింగ్‌కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేశారు.

## పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

**సంగారెడ్డి బ్యూరో, మే 12 ప్రభాతవార్త:** నేడు జరుగబోయే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలోని మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల ఏర్పాట్లకు అధికారులకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇందుకు సంబంధించిన ఈవీఎంలు, ఇతర సామాగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో,జహీరాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆదివారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్ సందర్శించి పంపిణీ ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఏర్పాట్ల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంపిణీకి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులు పూర్తయ్యే వరకు అప్రమత్తగా ఉండాలని సూచించారు. ఎన్నికల అధికారులు సూచించిన నియమ నిబంధనలను పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా సరిహద్దు 150 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని అన్నారు. ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి 3 వేల మంది సిబ్బందితో ఏర్పాట్లు చేశామన్నారు. సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియం నుంచి ఈవీఎంలు తీసుకొని తరలి వెళ్తున్న సిబ్బంది వాహనాన్ని ఆర్డీవో వసంతకుమారి జెండా ఊపి ప్రారంభించారు.


ఈవీఎంలు, ఇతర సామాగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

# పారదర్శకంగా ఎన్నికల పోలింగ్

- దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు
- పోలింగ్ సమయాన్ని సాయంత్రం 6 గంటల వరకు పొడిగించిన ఎన్నికల కమిషన్
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, మే 12 ప్రభాతవార్త:**

ఎన్నికల నిబంధనల మేరకు పారదర్శకంగా ఎన్నికల పోలింగ్ జరిగేలా చూడాల్సిన బాధ్యత పోలింగ్ సిబ్బందిదే అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మెదక్ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ నిర్వహించాలని, ఉదయం 5 గంటలకే మాక్ పోలింగ్ చేపట్టాలని, ఉదయం 7 గంటలకు వాస్తవ పోలింగ్ ప్రారంభించాలని చెప్పారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని నివేదించాలన్నారు. ఈవీఎంలకు ఏమైనా సాంకేతికసమస్యలు ఉత్పన్నమైనా, ఏమైనా సెక్టార్ అధికారులు, రిటర్నింగ్ అధికారులకు నివేదించాలని చెప్పారు. పోలింగ్ ముగిసిన అనంతరం నిబంధనల మేరు సీల్ వేసి రిసెప్షన్ కేంద్రాలలో అప్పగించాలని చెప్పారు. సాజావుగా ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియ నిర్వహించడం జరిగిందని, ఎన్నికల్లో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రజలు


పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ఆలోచించి స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. నియోజకవర్గాల కేంద్రంలోని పంపిణీ కేంద్రం నుండి ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, వోపీవోలు 277 పోలింగ్ కేంద్రాల్లో 28 రూట్లలో 61 బస్సుల ద్వారా 1280 మంది పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామాగ్రితో తరలి వెళ్లడం జరిగిందన్నారు. ప్రోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, సీనియర్ సిటిజన్స్‌కు, పీడబ్ల్యూడీ ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్స్ అందుబాటులో ఉంటాయని, వినియోగించుకోవచ్చని వివరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసి డబ్బు కానీ, మద్యం కానీ పంపిణీ చేసినట్లు ఏమైనా ఫిర్యాదులు అందినట్లయితే ఎన్నికల నియమావళి ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చున్నారు. జిల్లాలో అధిక పోలింగ్ శాతం నమోదయ్యేవిధంగా విస్తృతంగా ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, ప్రశాంత, పారదర్శక, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు ప్రజ లందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్‌న రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రమాదేవి, డీఎస్పీ రాజేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, సంబంధిత తహసీల్దార్లు, పోలింగ్ విధులు నిర్వ హించే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు
### -రూ. 33,63,589 విలువగల మద్యం స్వాధీనం.. ఎస్పి రూపేష్ చెన్నూరి

**సంగారెడ్డి టౌన్, మే 12, ప్రభాతవార్త:** ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పి సిహెచ్ రూపేష్ చెన్నూరి తెలిపారు. 2400 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీసు ఠాణాల పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. ప్రజల స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**1కోటి 84లక్షల 67వేల 636 రూపాయలు స్వాధీనం...**

ఎన్నికల కోడ్ అమలులోకివచ్చినప్పటి నుంచి 1కోటి 84లక్షల 67వేల 636 రూపాయలను స్వాధీనం చేసినట్లు ఎస్పి రూపేష్ చెన్నూరి పేర్కొన్నారు. 33 లక్షల 63వేల 589 రూపాయల విలువ గల 5101.266 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. 845 కేసులలో 1156 మందిని బైండోవర్ చేశామన్నారు. 2 గంజాయి కేసులు నమోదైనట్లు, రూ. 53,750 విలువగల 2.15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికలను ప్రభావితం చేసేందుకు వినియగించే 12లక్షల 45వేల 676 రూపాయలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై 9 కేసులు నమోదు చేశామని, నియమావళిని ఉల్లంఘించిన వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పి సిహెచ్ రూపేష్ చెన్నూరి హెచ్చరించారు.


రోడ్డు పక్కన గుంతలోకి దూసుకుపోయిన ఆర్టీసి బస్సు

## గుంతలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
### -తప్పిన ప్రమాదం... ఊపిరి పీల్చుకున్న ప్రయాణీకులు

**అల్లాదుర్గం, మే 12, ప్రభాతవార్త:** రాంగ్ రూట్‌లో వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి గుంతోకి ఆర్టీసి బస్సు దూసుకుపోయిన సంఘటన అల్లాదుర్గం పోలిసుఠాణా పరిధిలోని కాయిదాంపల్లి గ్రామ శివారులో 161వ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివారలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి నారాయణఖేడ్ వైపుకు నారాయణఖేడ్ డిపోకు చెందిన ఆర్టీసి బస్సు మండల పరిధిలోని కాయిదాంపల్లి గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న ద్విచక్రవాహానాన్ని తప్పించబోయి బస్సు గుంతలోకి దూసుకుపో యింది. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణీకులెవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో ప్రయాణీకులు, ఆర్టీసి బస్సు డ్రైవర్, కండక్టర్లు ఊపిరి పీల్చుకున్నారు.

## రోడ్డెక్కిన అన్నదాత

**చిన్నశంకరంపేట, మే12,ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తూకం వేయడం లేదంటూ ఆగ్రహించిన అన్నదాత రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధి అంబాజీపేటలోని ధాన్యాన్ని వారం,పది రోజులైన తూకం వేయడం లేదంటూ రైతులు ఆదివారం మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై గంట పాటు నిరసన వ్యక్తం చేశారు. ధాన్యం తూకం వేయకపోవడంతో అకాల వర్షాల కారణంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళారులు ఇదే అదనుగా రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో కొనుగోళ్లు జరుగుతుంటే తమ గ్రామంలో ఎందుకు వేయడం లేదని రైతులు నిర్వాహకులను ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లు వెంటనే జరపాలని రైతులు కోరుతున్నారు.


మెదక్-చేగుంట రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

# జిల్లాలో పార్లమెంటు ఎన్నికలకు రంగం సిద్ధం

- నేడే పోలింగ్..
- సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా..
- మెదక్,కరీంనగర్,భువనగిరి పార్లమెంటు అభ్యర్థులకు ఓటు వేయనున్నా జిల్లా ఓటర్లు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

నేడు(సోమవారం) జరిగే పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ప్రజా తీర్పుకు సిద్దిపేట జిల్లాలో రంగం సిద్దమైంది. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సాగనుంది. సిద్దిపేట జిల్లా ఓటర్లు మూడు పార్లమెంటు నియోజకవర్గాల అభ్యర్థులకు ఓటు వేయనున్నారు. సిద్దిపేట జిల్లా మెదక్, భువనగిరి, కరీంనగర్ పార్లమెంటు స్థానాల్లో విస్తరించి ఉంది. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల ఓటర్లు మెదక్ పార్లమెంటు అభ్యర్థులకు ఓటు వేయనుండగా, హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఓటర్లు కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థులకు ఓటు వేస్తారు. అలాగే బెజ్జంకి మండలంలోని ఓటర్లు సైతం కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థులకు ఓటు వేస్తారు. చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూళ్‌మిట్ట మండలాలకు చెందిన ఓటర్లు భువనగిరి పార్లమెంటు అభ్యర్థులకు ఓటువేయనున్నారు. నాలుగు నియోజకవర్గాలు ఉన్న జిల్లాలో 131 రూట్లుగా విభజించారు. ఇవిఎంలతోపాటు వీవీప్యాట్ ఇతర పోలింగ్ సామాగ్రిని ఆదివారం మధ్యాహ్నం ప్రిసైడింగ్ అధికారులకు అప్పగించారు. సిద్దిపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, సీపీ డా॥అనురాధ స్వయంగా దగ్గరండి సిద్ధంచేసిన ఇవిఎంలను, ఇతర సామాగ్రిని పరిశీలించారు. జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ నియోజకవర్గాలలో 9,66,330 మంది ఓటర్లకుగానూ 1152 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 122 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. సిద్దిపేటలో 273,


ఎన్నికల సామాగ్రితో బస్సులో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

దుబ్బాకలో 253, హుస్నాబాద్ 304,గజ్వేల్ 322 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో 2,37, 591మంది, దుబ్బాకలో 2,00.125 మంది, గజ్వేల్‌లో 2,80, 913, హుస్నాబాద్‌లో 2, 47,701 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సమస్యాత్మక గ్రామాలపై పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో కేంద్ర పారా మిలటరీ దళాలతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నిల సామాగ్రిని తరలించడానికి వాహనాలు ఏర్పాటు చేశారు. 6 వేలకు పైగా సిబ్బందిని పోలింగ్‌కు వినియోగిస్తున్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు పూర్తి చేశారు.

**పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది, ఇవిఎంలు**

పార్లమెంటు ఎన్నికల కోసం కేటాయించిన ఇవిఎంలు, పోలింగ్ సామాగ్రితో ఆయా పోలింగ్ స్టేషన్లకు చేరుకున్న సిబ్బంది పోలింగ్ నిర్వాహణకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఎన్నికల విధులు నిర్వహించేందుకు వివిధ జిల్లాలకు చెందిన ఉద్యోగులు ఆదివారం ఉదయం ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలకు చేరుకున్నారు. సిద్దిపేట నియోజకవర్గంకు చెందిన ఎన్నికల సామాగ్రిని పట్టణ శివారులోని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో గజ్వేల్ ఐఓసి, దుబ్బాక లచ్చపేట మోడల్ స్కూల్, హుస్నాబాద్ మోడల్ స్కూల్‌లో ఇవిఎంలను, వీవీ ప్యాట్‌లతో పాటు ఇతర ఎన్నికల సామాగ్రిని అధికారులు అప్పగించారు. ఇవిఎంలు, వీవీ ప్యాట్‌లు, ఇతర సామాగ్రిని తీసుకున్న పోలింగ్ అధికారులు, సిబ్బంది ప్రత్యేకబస్సుల్లో పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కాగా జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరును పరిశీలించారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బాలస్వామి

## లోక్‌సభ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత
### -జిల్లా ఎస్పీ బాలస్వామి

**మెదక్ మున్సిపాలిటీ, మే 12 ప్రభాతవార్త:** ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా లోక్‌సభ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ బాలస్వామి అన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో, నర్సాపూర్ బీవీఆర్ఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణి కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలస్వామి మాట్లాడుతూ నేడు జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు చేపట్టిన భద్రతా చర్యలను వివరించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి 1309 మంది జిల్లా, రాష్ట్ర, కేంనరద బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి మండలానికి ఇన్స్‌పెక్టర్ స్థాయి అధికారితో ప్రత్యేక పెట్రోలింగ్ పార్టీలు, 78 రూట్ మొబైల్స్, 21 క్విక్ రియాక్షన్ టీమ్స్‌తో పకడ్బందీగా భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 770, లొకేషన్స్ 530 ఉండగా, 127 పోలింగ్ కేంద్రాలను క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు రూ.1,45,94,194 స్వాధీనం చేసుకోవడం జరిగిందని, లిక్కర్ 3322.555 లీటర్లు సుమారుగా అంచనా విలువ రూ.14,47,516, ఇతర సామాగ్రి ఫ్రీ బీజ్ సుమారుగా అంచనా విలువ రూ.42,87,500, జిల్లాలో ఇప్పటి వరకు 241 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజు నుండి ఇప్పటివరకు జిల్లాలో ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసులు 6 నమోదుకావడం జరిగిందన్నారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు లైసెన్స్ కలిగిన ఆయుధాలు అన్ని డిపాజిట్‌లకు నిషేధాజ్ఞలు జారీ చేయడం జరిగిందన్నారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి భయం లేకుండా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ బాలస్వామి కోరారు.

## పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలి
### సిపి అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



ఈవీఎం పంపిణీని పరిశీలిస్తున్న సీపీ డా॥అనురాధ

అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎన్నికల విధులు నిర్వహించాలని సీపీ డా॥అనురాధ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పొన్నాల గ్రామ శివారులోని ఇందూర్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఈవీఎంల పంపిణీ కేంద్రాన్ని సందర్శించి రూట్ మొబైల్స్ స్ట్రైకింగ్ ఫోర్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. అనంతరం అమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికి కేటాయించిన విధులను వారు బాధ్యతగా నిర్వహించి పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా కృషి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఓటు వేయడానికి వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణంగా తనిఖీ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, మండే వస్తువులు లాంటివి నిషేధించిన వస్తువులను ఎవరూ కూడా పోలింగ్ బూత్‌లోనికి తీసుకొని రాకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనిపించినా లేదా ఏదైనా సమస్య తలెత్తినా వెంటనే పోలీసు అధికారులకు, రూట్ మొబైల్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. 2482 మంది పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో కేంద్ర పారామిలటరీదళాలతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాంతియుత, స్వేచ్ఛపూరిత వాతావరణంలో ఎన్నికలు జరి గేలా పోలీసు అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో సిద్దిపేట ఏసీపీ మధు, సీఐలు లక్ష్మీబాబు, ఉపేందర్, విద్యాసాగర్, కిరణ్, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు భద్రత ఏర్పాట్లు
### -జిల్లా ఎస్పి సిహెచ్ రూపేష్ చెన్నూరి

**సంగారెడ్డి టౌన్, మే 12, ప్రభాతవార్త:** ఈ నెల 13న జరుగనున్న జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణలో ముగిసేలా అవసరమైన కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పి సిహెచ్ రూపేష్ చెన్నూరి పేర్కొన్నారు. ఆదివారం డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసీవింగ్ (డిఆర్‌సి) కేంద్రాల నుంచి ఈవిఎంలు ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న సందర్భంగా సంగారెడ్డి డిఆర్‌సి, అంబేద్కర్ స్టేడియం, పటాన్‌చెరు, రుద్రారంలోని శ్రీచైతన్యకళాశాల, అందోల్ నియోజకవర్గంలోని జెఎన్‌టియులో డిఆర్‌సి కేంద్రాలను ఎస్పి ప్రత్యక్షంగా సందర్శించారు. ఈవీఎంలతోపాటు ఎన్నికలవిధులకు హాజరవుతున్న పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రూట్ మొబైల్ అధికారులు తమ ఏరియాల్లో గల సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతరం పెట్రోలింగ్‌చేయాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా పోలీసు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పి సిహెచ్ రూనేష్ చెన్నూరి సూచించారు.


పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పి రూపేష్ చెన్నూరి



శంకర జయంతి సందర్భంగా శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయం వద్ద ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

## ఉజ్జయిని మహాకాళి ఆలయం వద్ద ఊరేగింపు

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో ఆదివారం శ్రీశ్రీశ్రీ శంకర జయంతి సందర్భంగా బాజా భజంత్రీలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి తెలియజేసారు. శంకర జయంతి సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించడంతో పాటు ఆలయ పరిసరాలలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మ వారి ఉత్సవ కార్యక్రమాన్ని కన్నులారా వీక్షించి తరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ పూజలలో మహంకాళీ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ పరుశురాం పాల్గొన్నారు. (ప్రభాతవార్త - బేగంపేట)

## ఓటుహక్కు వినియోగించుకోనున్న సినీరంగ ప్రముఖులు

హైదరాబాద్, మే 12 ప్రభాతవార్త : నేడు జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పలు రంగాలకు చెందిన ప్రముఖులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ముఖ్యంగా సినిమా రంగానికి చెందిన వారు పోలింగ్ స్టేషన్‌లకు చేరుకొని ఓట్లు వేయనున్నారు. ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో జూనియర్ ఎన్టీఆర్, ప్రణతి, బీఎస్ఎన్ఎల్ సెంటర్ జుబ్లీహిల్స్‌లో అల్లు అర్జున్, స్నేహారెడ్డి, అల్లు అరవింద్, అల్లు శిరీష్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మహేశ్‌బాబు, నమ్రత, మంచు మోహన్‌బాబు, విష్ణు, లక్ష్మీ, మనోజ్, విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, శ్రీకాంత్, ఎఫ్ఎన్‌సీసీలో రాఘవేంద్రరావు, జీవిత, రాజశేఖర్, విశ్వక్‌సేన్, దగ్గుబాటి రాణా, సురేశ్‌బాబు, జూబ్లీహిల్స్ క్లబ్‌లో చిరంజీవి, సురేఖ, రాంచరణ్, ఉపాసన, నితిన్, జూబ్లీహిల్స్ న్యూఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో రవితేజ, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో నాగార్జున, అమల, నాగచైతన్య, అఖిల్, మణికొండ హైస్కూల్‌లో వెంకటేశ్, బ్రహ్మానంద, షేక్‌పేట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రాజమౌళి, రమా రాజమౌళి, బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో హీరో రామ్ పోతినేని, గచ్చిబౌలి జిల్లా పరిషత్ పాఠశాలలో హీరో నాని, దర్గా గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్‌లో హీరో సుధీర్‌బాబు, రోడ్ నెం. 45 జుబ్లీహిల్స్ ఆర్థిక సహకార సంస్థ వద్ద అల్లరి నరేశ్, యూసఫ్‌గూడ చెక్‌పోస్టు ప్రభుత్వ పాఠశాలలో తనికెళ్ల భరణిలు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

## ఓట్లువేసి గెలిపిస్తే పాతనగరం ప్రజల రుణం తీర్చుకుంటా

**బిఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్**

గోషామహల్, మే 12 ప్రభాతవార్త: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా 13వ తేదిన జరగనున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ హాయంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు బిఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి గడ్డంశ్రీనివాస్ యాదవ్ కోరారు. తనను గెలిపిస్తే పాతనగర ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. 24గంటలపాటు అందుబాటులోఉండి, ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకుగాను కృషి చేస్తానన్నారు. తాను ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. మతం, ధర్మంపేరిట ఓట్లు అడిగే వారికి గట్టి బుద్దిచెప్పాలన్నారు.

## బిఆర్ఎస్‌కు అత్యధిక మెజార్టీ ఖాయం

**నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్**

అఫ్జల్‌గంజ్, మే 12 ప్రభాతవార్త: సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నాంపల్లి నియోజవర్గం నుంచి బిఆర్ఎస్‌కు అత్యధిక మెజార్టీ ఇవ్వనున్నట్లు నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. ప్రజలు నమ్మి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే ఆరు నెలలలోనే ప్రజలు అనేక ఇబ్బందుల పాలైయమని వాపోతున్నారు. ఫించన్లు, సంక్షేమ పథకాలు సరిగా అందడంలేదని ప్రచారంలో వాపోయినట్లు వివరించారు. ప్రజలను ఆరుగ్యారీంట్లతో మోసం చేసిందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే నగరాభివృద్ధి సాధ్యం

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత తొలుపునూరి కృష్ణగౌడ్**



ప్రసంగిస్తున్న తొలుపునూరి కృష్ణగౌడ్

హైదరాబాద్, మే 12 ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నగరంలో సమస్యలు పరిష్కారమవుతాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత తోలునూరి కృష్ణగౌడ్ అన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందాలంటే సికింద్రాబాద్ కాంగ్రెస్ లోకసభ అభ్యర్థి దానం నాగేందర్ రెండులక్షల భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో ఐదింటిని ఇప్పటికే అమలు చేశామని, ఎన్నికల తర్వాత మిగిలిన హామీలైన రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ కూడా చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ఐదు న్యాయ హామీలు కూడా అమలు అవుతాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ కనుమరుగు అవడం ఖాయమన్నారు. బిజెపిని రాష్ట్రం నుంచి తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని, బిఆర్ఎస్, బిజెపికి ఓట్లు వేస్తే మురిగినట్లేనని, భారీ మెజారిటీతో దానం నాగేందర్‌ను గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీమనగిరి, ఏనుగంటి దిలీప్, నరేశ్‌గౌడ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీకి ఎంఐఎం మద్దతు

కెపిహెచ్‌బి కాలనీ, మే 12, ప్రభాతవార్త : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీకి ఎంఐఎం తన పూర్తి మద్దతును ప్రకటించింది. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధి అల్లాపూర్‌కు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారు. అల్లాపూర్ డివిజన్‌లో గతంలో ఎంఐఎం తరపున కార్పొరేటర్‌గా పోటీ చేసిన కుర్షిదా బేగం ఆమె తనయులు ఇద్దరు రహీం, మహమ్మద్ మరో 50మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ వారికి సాదర ఆహ్వానం పలికారు. పార్లమెంట్ నియోజకవర్గం అందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించి పార్టీ విజయానికి రాహుల్‌గాంధీ దేశ ప్రధాని అయ్యేందుకు కృషి చేయాలని రమేష్ ఈ సందర్భంగా వారికి సూచించారు.

## ఓటు మన బాధ్యత

**రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్**

ముషీరాబాద్, మే12, ప్రభాతవార్త: ఓటు మన బాద్యత అని, ప్రతి ఒక్క ఓటరు తమ బాద్యతను గుర్తించి, ఓటు వేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్ సూచించారు. ఆదివారం ముషీరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, అదే విధంగా ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులందరితో కలసి వెళ్లి ఓటు వేసి, ఇతరులు కూడా ఓటు వేసే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఓటింగ్ శాతం చాలా తక్కువగా ఉంటోందని, ఓటు విలువ తెలుసుకుని, ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొని, ఓటింగ్ శాతం పెంచాలని కోరారు. ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కు ద్వారా సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకుని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ఆదిశంకాచార్యుల జయంతి

**పూజలు నిర్వహించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

చిక్కడపల్లి, మే 12 ప్రభాతవార్త: ప్రపంచంలో భారత్ అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నదని కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆది శంకరాచార్యుల వారి జయంతి సందర్భంగా నల్లకుంటలోని శంకర్‌మఠ్ ఆలయంలో స్వామివారి ఆశీస్సులు తీసుకుని పూజలు నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని, మన దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ప్రపంచంలో మన దేశ గౌరవం మరింత పెరగాలని, ఉగ్రవాదం, తీవ్ర వాదం లేని శాంతియుత వాతావరణం ఉండాలని అమ్మ వారిని, శంకరాచార్యులను కోరుకుంటున్నానని అన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికల సందర్భంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలింగ్ శాతం తగ్గుతున్న నేపథ్యంలో ఈసారి అందరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి విధిగా ఓటు వేయాలని సూచించారు. పోలింగ్ డేను సెలవు దినంగా చూడకూడదని, దేశం కోసం, సమాజం కోసం మంచి చేసే వారిని ప్రజలు ఓటు వేసి ఎన్నుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌మఠ్ బ్రాంచ్ హెడ్ కె.కృష్ణారావు పాల్గొన్నారు.

## క్రైస్తవులపై దౌర్జన్యాలు, దాడులు పెరిగాయి

చిక్కడపల్లి, మే 12 ప్రభాతవార్త: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దౌర్జన్యాలు, దాడులు జరిగిన సమయంలో కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచి మద్దతు పలికిందని, ఇందుకుగాను లోకసభ ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాల్సిన అవసరం ఉందని తెలంగాణ యూనైటెడ్ క్రిస్టియన్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్ అన్నారు. ఆదివారం నగరంలో అసోసియేషన్ ప్రతినిధులు బిషప్ ఆశీర్వాదం, డాక్టర్ జి.సామ్యూల్, ఎం.పురుషోత్తమ్, టి.భాస్కర్, బి.విన్‌స్టన్, యూ.డానియాల్, థామస్ ఓమెన్, విలియమ్స్, దివ్యవాణి తదితరులతో కలిసి సమావేశం జరిగింది. సాల్మన్‌రాజ్ మాట్లాడుతూ తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాజకీయ పార్టీలకు అతీతంగా క్రైస్తవులందరు పరిస్థితులను ఆలోచించి 'ఇండియా కూటమి'కి అనుకూలంగా ఓటు వేయాలని కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం క్రైస్తవులపై దాడుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించారని, క్రైస్తవ మైనారిటీలను రక్షించడంలో విఫలమయ్యారన్నారు. క్రైస్తవుల భద్రతలను దృష్టిలో ఉంచుకుని, భారత రాజ్యాంగ చట్టం ప్రకారం నిర్భయంగా మతాలను ఆచరించేందుకు లౌకిక పార్టీకి మద్దతు ఇవ్వాలని, జాతీయ స్థాయిలో క్రైస్తవ మైనారిటీలకు ఎంతో ప్రయోజనం చేకూర్చే కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలు పొందాలని నిర్ణయించుకున్నామన్నారు. ఈ సమావేశంలో జంట నగరాల పాస్టర్స్ అండ్ లేమెన్ ఫెలోషిప్ అధ్యక్షుడు టి.ఎం.కుమార్, తెలంగాణ యూనైటెడ్ పాస్టర్స్ సినోడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.మెన్నోజోయల్, పెంటెకోస్టల్ చర్చ స్ ఆఫ్ తెలంగాన అధ్యక్షుడు జయకుమార్, యూనైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధి బెన్నోనోయ్‌రిచర్డ్, తెలంగాన క్రిస్టియన్ ఉమెన్స్ ఫెడరేషన్ చైర్మన్ సి.హేమలత, ట్విన్‌సిటీస్ పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో భారీ బందోబస్తు

**చిక్కడపల్లి ఎసిపి ఎల్.రమేశ్‌బాబు**



పోలీసులకు సూచనలలిస్తున్న చిక్కడపల్లి సిఐ సీతయ్య

చిక్కడపల్లి, మే 12 ప్రభాతవార్త: పార్లవమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా భారీ బందోబస్తు ఏర్పాటు చేయబోతున్నట్లు చిక్కడపల్లి పోలీసు సబ్ డివిజన్ ఏసీపీ ఎల్.రమేశ్‌బాబు వివరించారు. ఆదివారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో ఎన్నికల సందర్భంగా చిక్కడపల్లి సిఐ ఏరుకొండ సీతయ్యతో పాటు ఎస్ఐలు, పోలీసులకు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మొత్తం 274 పోలింగ్ కేంద్రాలున్నాయని, ఒక్కో కేంద్రం వద్ద రెండు నుంచి నాలుగు పోలీసులు పహారాగా ఉంటారని, ఇందులో 22 క్రిటికల్ కేంద్రాలుగా గుర్తించి ఈ కేంద్రాల్లో కొత్త ఎక్కువ మొత్తంగా బందోబస్తు కేటాయిస్తున్నామన్నారు. వేలాది మందితో పోలీసులు బందోబస్తులో ఉంటారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నియమనిబంధనలను ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, ఇందులో ఎవరిని ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. రూట్ మొబైల్, చెక్‌పోస్టులు, ఫ్లైయింగ్ స్క్వాడ్, మూడు స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు ఎన్నికల విధుల్లో పాల్గొంటారన్నారు. పోలింగ్‌కు ముందు వివిధ రాజకీయ పార్టీలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బులు పంచే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని, డబ్బులను సీజ్ చేయడంతో పాటు ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకుంటామని, అవసరమైన మేరకు కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. అడ్మిన్ ఎస్ఐ నాగరాజు, ఎస్ఐలు శశిపాల్‌రెడ్డి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## గోషామహల్ నియోజకవర్గంలో అంచనాలు తారుమారు

గోషామహల్, మే 12 ప్రభాతవార్త: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికలో బరిలో నిలిచిన ఆయాపార్టీల అభ్యర్థులకు అనుకున్న అంచనాలు తారుమారయ్యే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా గోషామహల్ నియోజకవర్గంలో బిజెపి, బిఆర్ఎస్, మజ్లీస్, కాంగ్రెస్‌ల మధ్య పోటి ఉంటుందని అనుకున్నారు. కేవలం బిజెపి, మజ్లీస్‌ల మధ్య నువ్వానేనా రీతిలో ఓటింగ్ జరిగే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. గోషామహల్ నియోజకవర్గంలోని 6డివిజన్‌లోరెండులక్షల50వేలపైగా ఓట్లు ఉండగా అందులో బేగంబజార్, గన్‌ఫౌండ్రి, గోషామహల్, మంగళ్‌హాట్ డివిజన్ల నుంచి బిజెపికి మెజార్టీ రానున్నంది. మిగతా రెండు డివిజన్‌లైన జాంబాగ్, దత్తాత్రేయనగర్ డివిజన్ నుంచి మజ్లీస్‌కు అత్యధిక మెజార్టీ వస్తుంది. బిఆర్ఎస్, మూడవ స్థానంలో ఉంటుంది. కాంగ్రెస్‌పార్టీకి ఆశించిన మేరకు ఓట్లు పోలై అయ్యేటట్లు కనిపించడంలేదు. బేగంబజార్ డివిజన్‌లోని ఇందిరానగర్, మ్యాజిరి యాక్యాంపుబస్తీలలో మైనార్టీలు అధికంగా ఉన్నారు. ఇక్కడ కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు చెరి సగం ఓట్లు పోలతాయి. గోషామహల్ డివిజన్‌లో రజాక్‌పురా, చుడీబజార్, బస్తీలలో కూడా మైనార్టీలు కా ంగ్రెస్, టిఆర్ఎస్‌కు ఓట్లువేయనునన్నారు. ఇందిరానగర్, దేవినగర్, అంబేద్కర్‌నగర్, మొగరంబస్తీ, అశోక్‌బజార్, గౌలివాడ బస్తీలలోబిజెపి పార్టీకి అధికంగా ఓట్లు పడనున్నట్లుకనిపిస్తుంది. అత్యధికంగా దళితులు ఉండటం మూలంగా మందకృష్ణమాదిగ పిలుపు మేరకు ఏకపక్షంగా బిజెపికి దళితులు, టిడిపి ఓట్లుకూడా పోలు అయ్యే అవకాశాలు ఉన్నాయి. బిజెపికి యువత ఓట్లు ఆయుపట్టుగా ఉన్నాయి. విద్యావంతులు, వ్యాపారులు, మార్వాడికులస్థులు అధికంగా బిజెపి వైపు మొగ్గుచూపనున్నారు. ఏది ఏమైనప్పటికి గోషామహల్ నియోజకవర్గంలోని మైనార్టీలు మజ్లీస్ వైపు మొగ్గుచూపనున్నారని తెలిసింది.

బిఆర్ఎస్, కాంగ్రెస్ ఓటు వేసి చెల్లకుండా పోతాయని మైనార్టీలు చర్చించుకోవడం కనిపిస్తుంది. 13వ తేదిన జరిగే ఎన్నికలల్లో ఎవరికి ఎన్నిఓట్లు వేస్తారో వేచి చూడాల్సిందే.

## ఎన్నికలకు భారీ పోలీసు బందోబస్తు

బేగంబజార్, మే 13 ప్రభాతవార్త : గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లోభాగంగా నగరంలో సోమవారం జరిగే ఎన్నికలకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటలు జరగకుండా అప్రమత్తంగా పెట్రోలింగ్, సిసికెమెరాలు, తనిఖీలు చేస్తున్నారు. గోషామహల్ నియోజకవర్గంలోని సుల్తాన్‌బజార్, గోషామహల్, అబిడ్స్ అసిస్టెంట్‌కమీషనర్ పరుధుల్లో అఫ్జల్‌గంజ్, మంగళ్‌హాట్, హాబీబ్‌నగర్, షాహినాయత్‌గంజ్, అబిడ్స్, బేగంబజార్, సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లోని 235 పోలింగ్ బూత్‌లను ఏర్పాట్లు చేశారు. వెస్ట్‌జోన్, సెంట్రల్‌జోన్, ఈస్ట్‌జోన్ డిసిపిల పర్యవేక్షణలో గోషామహల్, సుల్తాన్‌బజార్, అబిడ్స్ ఎసిపిలు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు తమ పరుధుల్లో సిబ్బందితోపాటు సాయుధబలగాలు, రాపిడ్‌యాక్షన్ పోలీసులు బందో బస్తు కోసం రంగంలోకి దింపారు. ఈఎన్నికలను ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అసాంఘీశక్తులను హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాలపై నిఘా పెట్టేందుకుగాను స్ట్రైకింగ్‌ఫోర్స్, స్పెషల్‌స్ట్రైకింగ్‌ఫోర్స్‌లను రంగంలోకి దింపినట్లు చెప్పారు.

**ఉదయం 7గంట నుంచి సాయంత్రం 6గంటల వరకు కొనసాగనున్న ఓటింగ్**

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం జరగనున్న ఓటింగ్‌ను ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని ఎన్నికల కమీషన్ తెలిపింది. 13వ తేదిన జరగనున్న ఓటింగ్ నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థులు, కాని ఏజెంట్లు కాని ఓటర్లను మభ్యపెడినట్లు తెలిసితే చట్టప్రకారం చర్యలు తప్పవని ఎన్నికల కమీషన్ హెచ్చరించింది. ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతున్నారు. ప్రజా స్వామ్య విలువలను కాపాడాలంటే ఓటు హక్కు కలిగిన ప్రతి ఒకరు తమ విలువైన ఓటును పోలింగ్ కేంద్రాలకు వెళ్లి వినియోగించుకోవాల న్నారు. ఓటర్లు తమ ఓటుహక్కు స్లిప్‌తోపాటు ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసన్స్ వెంట తీసుకువెళ్లాలన్నారు.

## జంట నగరాల్లో ఘనంగా మాతృదినోత్సవ వేడుకలు

**మాతృమూర్తులకు పిల్లల పాదాభివందనాలు ✦ పిల్లలకు తల్లుల ఆశీస్సులు**

సైఫాబాద్, మే 12 ప్రభాతవార్త: అంతర్జాతీయ మదర్స్‌డేని పురస్కరించుకుని జంటనగరాల ప్రజలు ఆదివారం అమ్మల దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా ఘనంగా జరుపుకున్నారు. నవమాసాలు మోసి, కని, పెంచి, పెద్ద చేసి విద్యాబుద్ధులు నేర్పించి ఉద్యోగాలు, ఉపాధి కల్పించి ప్రయోజకులుగా, దేశ ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దిన తల్లి ప్రేమను ఎన్నటికి మరువలేనిదని కూతుళ్ళు, కొడుకులు తమ తమ తల్లులకు తెలియజేస్తూ మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కొడుకులు, కూతుళ్ళు వారి, వారి అమ్మల పాదాలు కడిగి పాదాభివందనాలు చేసి ఆశీస్సులు పొందారు. ఎం ఇచ్చినా, ఎన్ని జన్మలు ఎత్తిన కన్నతల్లి రుణం తీర్చుకోలేదని, సృష్టికి జీవం పోసింది అమ్మ, జన్మ జన్మలకు మళ్ళీ మీ కడుపునే పుట్టాలని కోరుకుంటూ తల్లులను పిల్లలు ప్రాదేయపడ్డారు. దీంతో తల్లులు కన్నీటి పర్యంతమైనారు. ఈ సందర్భంగా పిల్లలు తల్లులకు మిఠాయిలు తినిపించి, కానుకలు సమర్పించుకున్నారు. తల్లులు లేని పిల్లలు వారి, వారి అమ్మల ఫోటోలకు పూలు మాలలు వేసి నివాళులు అర్పించారు. చిన్ననాటి జ్ఞాపకాలను తలుచుకుంటూ తల్లి చేసిన త్యాగాలను మననం ఆందోళనకు గురైనారు. దూరపు ప్రాంతాలు, విదేశాల్లో ఉన్న కొడుకులు, కూతుళ్ళు వారి, వారి మాతృమూర్తులకు వీడియో కాల్స్ చేసి మదర్స్‌డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదిలా ఉండగా మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని అనేక సంస్థలు మాతృమూర్తులను ఘనంగా సత్కరించాయి. పత్రికలు ప్రత్యేకంగా వ్యాసాలు రాశాయి. టివి చానళ్ళు ప్రత్యేకంగా ప్రసారాలు చేశాయి.

**లోక్‌దళ్ కార్యాలయంలో మాతృదినోత్సవ వేడుకలు**

అంతర్జాతీయ మదర్స్‌డేని పురస్కరించుకుని ఆదివారం భారత జాతీయ లోకదళ్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మాతృదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు పలువురు మాతృమూర్తుల పాదాలకు వందనాలు చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ ఎన్ని జన్మలు ఎత్తినా తల్లుల రుణాలను తీర్చుకోలేమని, తల్లులు చేసే త్యాగాలు, సేవలు ఎన్నటికి మరువలేనవని కొనియాడారు. వృద్ధి చెందిన పిల్లలు తమ తల్లులను కంటికి రెప్పల్లా కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తల్లులు రామలక్ష్మి, దుర్గ, అనంతలక్ష్మి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు సిద్దం

**ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి : ఆర్.ఓ.మధుకర్ నాయక్**



కంటోన్మెంట్ పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల మెటీరియల్ సరఫరా చేస్తున్న ఆర్.ఓ. మధుకర్ నాయక్

కంటోన్మెంట్, మే 12 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, పోలింగ్ ఆఫీసర్లకు సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ తెలి పారు. మల్కాగిరి పార్లమెంట్, కంటో న్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును సద్విని యోగం చేసుకునేందుకు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రతే ్యక ఏర్పాట్లు చేశామన్నారు. 232 పోలింగ్ స్టేషన్లలో 2 లక్షల 53 వేల 706 మంది ఓటర్లు తమ ఓటు హక్కుఉ సద్వినియోగం చేసుకుంటారన్నారు. నియోజక వర్గంలోని 22 సెక్టార్లు ఏర్పాటు చేశామన్నారు. 2 వేల మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలు, 5 ఉమెన్స్‌కు, 1 వికలాంగులకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కంటోన్మెంట్‌లోని వివిధ పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈవిఎం మిషన్లు, వివి.ప్యాట్స్ సిబ్బందికి అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద సిసీసీ కెమరాలను ఏర్పాటు చేశామన్నారు.

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి**

కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ పోలింగ్ కే ందాలను ఆదివారం హైదరాబాద్ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్.ఓలు ఎం.దేవేందర్, రాజుకుమార్, ఆకుల మహేందర్, రమణ తదితరులు పాల్గొన్నారు. వికలాంగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్లను ఏర్పాటు చేశామన్నారు.

## ఓటు ఎక్కడ వేయాలి..?

**నగరంలో నమోదు.. ఊరిలో ఓటు**

**రెండు ప్రాంతాల్లో ఓట్లు.. తేల్చుకోలేక సతమతం**




ఈవిఎంలను పోలింగు స్టేషన్లకు తీసుకెళ్తున్న సిబ్బంది

హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త: అంబర్‌పేట గోల్నాకలో ఉంటున్న చెరుకు వెంకన్నది సొంత ఊరు పాలకుర్తి పరిధిలోని వల్మిడి, పదేళ్ల క్రితం కుంటుంబ సభ్యులతో కలిసి నగరానికి వలస వచ్చి గోల్నాకలో నివాసముంటున్నారు. అయితే, జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంలో గోల్నాకలో పరిధిలో అమ్మ, నాన్నతోపాటు భార్య ఓటు నమోదు చేయించారు. ఆ ఎన్నికల్లో ఓటేశారు. ఓటు నమోదు చేసుకున్న సందర్భంలోనే ఊరిలో ఓటు తొలిగించారని భావించారు. కానీ నాలుగు రోజుల క్రితం హాలియా నుంచి ఓ పార్టీ అభ్యర్థి అనుచరులు ఫోన్ చేసి ఇక్కడ ఓటు ఉందని, వేసి వెళితే నలుగురికి రవాణా చార్జీలు అందిస్తామని చెప్పారు. గోల్నాకలో ఓటు ఉన్నా కానీ, ఇప్పటి వరకు ఏ పార్టీవారు స్పందించలేదు. అయితే, ఊరికి వెళ్లి ఓటు వేయాలా ? లేకుంటే ఇక్కడే ఉండి ఓటు వేయాలా ? అనే అంశంపై వెంకన్న కుటుంబం సందిగ్ధంలో పడింది. ఇదే తరహాలో నగరంలోని పలువురు ఓటు ఎక్కడ వేయాలా అనే అంశంపై సందిగ్ధంలో పడ్డారు. ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చినవారికి ఇటూ గ్రేటర్ పరిధిలో ఓటు నమోదు చేసుకోగా, సొంత ఊళ్లల్లో కూడా ఓట్లు ఉన్నవారంతా ఎక్కడ ఓటు వేయాలనే అంశాన్ని కొందరూ తేల్చుకోలేకపోతున్నారు. ఊళ్లల్లో ఓటేసేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు ఫోన్లు చేసి మరీ పిలుస్తున్నారు. అయితే నగరంలో ఓటు ఉన్నా కానీ, ఇక్కడ వేద్దామంటే ఇప్పటి వరకు ఎవరూ కూడా తమను సంప్రదించలేదని, ఊరికి వెళ్లాలంటే రెండు రోజుల పనిపోతుందని వాపోతున్నారు.

**నగరంలో పట్టించుకోవట్లే..**

గ్రేటర్ పరిధిలో ఓటు ఉన్నా కానీ, లోక్‌సభ అభ్యర్థులు అంతగా ప్రాధాన్యమివ్వడంలేదు. కొన్ని ప్రాంతాలు, కొన్ని కాలనీలు, కొన్ని బస్తీల్లోనే ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాలను ఏమాత్రం పట్టించుకోవడంలేదు. నగరానికి వలస వచ్చి స్థిరపడిన ఓటర్లను ఆయా ప్రాంతాల్లోని అభ్యర్థులు పట్టించుకోవడంలేదు. వారికి ఊళ్లల్లో కూడా ఓటు ఉందనే సమాచారముంటే చాలు. ఆవైపు కన్నెత్తి చూడడంలేదు.



### నకిలీ ఓటరనే ఆరోపణ వస్తే...

ఓటరు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన తర్వాత అతడు అసలు ఓటరు కాదని నకిలీ ఓటరని పోలింగ్ ఏజెంట్ల నుండి ఆరోపణలు రావొచ్చు. ఆసమయంలో అనుమతించేదే ఛాలెంజ్ ఓటు. ఆరోపణ చేసిన ఏజెంట్ నుండి రూ.2రుసుము తీసుకుని రసీదు ఇస్తారు. తర్వాత ఏజెంటు ఓటరు వాదనను అధికారి విని ఇతర ఓటర్ల నుండి వివరాలు తీసుకుంటారు. నిజమైన ఓటరుగా తేలితే ఓటేయడానికి అనుమతిస్తారు. లేకపోతే అతడిని పోలీసులకు అప్పగిస్తారు. ఛాలెంజ్ ఓటు వేసిన వ్యక్తి పేరు, చిరునామా ఫారం-14లో పేర్కొంటారు.

### దివ్యాంగుల కోసం..

పురుషులకు, మహిళలకు దివ్యాంగులకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన క్యూలో నిల్చోవాలి. దివ్యాంగుల కోసం ఈసారి ప్రత్యేక వాహన సదుపాయాన్ని కల్పిస్తున్నారు. ఇంటివద్ద నుండి తీసుకెళ్లి ఓటు వినియోగించుకున్న తర్వాత తిరిగి వాహనంలో ఇంటికి చేరుస్తారు. పోలింగ్ కేంద్రం వద్ద వీరికోసం ప్రత్యేక ర్యాంపులను కూడా ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద వీరికి వెయింటింగ్ రూం, తాగునీరు మరుగుదొడ్డి ,తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. అంధులకోసం బ్రెయిలీ లిపితో కూడిన బ్యాలెట్‌ను అందుబాటులో పెడుతున్నారు. అలాగే ఈసారి అందులు, దివ్యాంగులు ,వృద్ధుల కోసం హోమ్ ఓటింగ్ నిర్వహించారు. ఇప్పటికే చాలామంది దానిని వినియోగించుకున్నారు.

# దృష్టి మరల్చి చోరీ చేసిన దొంగల అరెస్టు

తార్నాక, మే 12 ప్రభాతవార్త : దృష్టి మరల్చి చోరీలు, దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను ఉస్మానియా యూనివర్సిటీ పోలీ సులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం. మహారాష్ట్రకు చెందిన ముఖేష్( 35) మేస్త్రీ పనిచే స్తున్నాడు. ఇదిలా ఉండగా ఈ నెల 6న నాగోల్‌నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు రోడ్డుపై ఆటో కోసం ఎదిరిచూస్తున్నాడు. అదే సమయంలో నగరంలోని బార్కాస్‌కు చెందిన యాసిన్ అలీ ఖాద్రి (21), పహడిషరీఫ్‌కు చెందిన షేక్ ఉమ్రాన్, యాఖత్‌పూరాకు చెందిన సయ్యద్ అదిల్(32) కలిసి ఆటోలో వచ్చారు. ముఖేష్‌ను ఎక్కించుకున్నారు. మార్గమధ్యలో అతని దృష్టి మరలించి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగిలించారు. తార్నాక ప్రధాన రోడ్డులో ఉన్న గుడ్‌ల్యాండ్ బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు రాగానే ఆటోలో స్థలం సరిపోవడంలేదని అతనిని మార్గమధ్యలో దింపి సెల్‌ఫోన్‌తో ఉడాయించారు. అతను మరో ఆటోలో సికింద్రాబాద్ స్టేషషన్‌కు చేరుకున్నాడు. అక్కడికి వెళ్లిన తరువాత తన సెల్‌ఫోన్ చోరికి గురైనట్లు గ్రహించి తిరిగి ఓ.యూ పిఎస్‌కు చేరుకొని ఫిర్యాదు చేశాడు. దీంతో ఓ.యూ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు మొదలుపెట్టారు. ఆదివారం నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గతంలో కూడా వీరిపై కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి ఆటోతో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాదీనం చేసుకున్నట్లు డిఐ ప్రదీప్‌కుమార్, ఎస్సై సిహెచ్.రవికుమార్ తెలిపారు.

# నేడే పోలింగ్



మౌంటెడ్ కెమెరాలతో ప్రత్యక్ష ప్రసారాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కి లింక్ చేశారు. ఎలాంటి చిన్న సమస్య తలెత్తినా వెంటనే అలర్ట్ అవుతారు. అందుకు 4వేలకు పైగా వైర్‌లెస్ సెట్లను సిబ్బందికి అందజేశారు.





- ఓట్ల పండగకు సర్వం సిద్ధం
- పోలింగ్ సెంటర్లకు చేరిన ఈవిఎంలు, సిబ్బంది
- ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం
- సాయంత్రం 6గంటలకు ముగింపు
- 40వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు
- ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్

హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త: ఓట్ల పండగకు నగరం సిద్ధమైంది. నేడు జరిగే పార్లమెంట్ ఎన్నికలకు అధికారులంతా సర్వం సిద్ధం చేశారు. గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లోని నాలుగు ఎంపి స్థానాలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీకి ఉప ఎన్నిక జరుగుతుండగా దాదాపు పదివేల పోలింగ్ కేంద్రాల్లో కోటి పదిలక్షలమంది ఓటర్లు ఓటు వేయనున్నారు. సోమవారం ఉదయం 7గంటలకు ప్రారంభమయ్యే పోలింగ్ సాయంత్రం 6గంటలకు ముగియనుంది. అలాగే సమాస్యాత్మక ప్రాంతాల్లో 4గంటల వరకే పోలింగ్ జరగనుంది. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. ఎన్నికల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందో బస్తు ఏర్పాటు చేశారు.

**పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా ఓట్లు.. పోలింగ్ సెంటర్లు**

హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో మొత్తం 22,17,305 ఓట్లు ఉండగా అందులో పురుషులు -11,25,283, మహిళలు -10,91,615, ఇతరులు -196, సర్వీస్ ఓట్లు 211 ఉన్నాయి. ఈపార్లమెంట్ స్థానంలో ఓటర్లకోసం 1944 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా 30మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 21,20,550 ఓట్లు ఉండగా అందులో పురుషులు-10,86,875 మహిళలు- 10,33,396, ఇతరులు -130, సర్వీస్ ఓట్లు 149 ఉన్నాయి. ఇందుకు 1,810 పోలింగ్ స్టేషన్‌కు ఏర్పాటు చేయగా 45మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో 37,80,453 ఓట్లు ఉండగా అందులో పురుషులు -19,45,634, మహిళలు -18,33,430, ఇతరులు -542, సర్వీస్ ఓటర్లు 857మంది ఉన్నారు. ఇక్కడ మొత్తం 3,228 పోలింగ్ సెంటర్లు ఏర్పాటు చేగా 22 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే చేవెళ్ల పార్లమెంట్‌లో 29,39,057 ఓటర్లు ఉండగా అందులో పురుషులు -15,04,260, మహిళలు 14,33,830, ఇతరులు -280, సర్వీస్ ఓటర్లు 687మంది ఉన్నారు. వీరికి 2,877 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా 43మంది బరిలో ఉన్నారు.

**40వేల మందితో పటిష్టమైన బందోబస్తు..** ఎన్నికలకు మూడు కమిషనరేట్ల పరిధిలో భారీ ఏర్పాట్లు చేబట్టారు. మొత్తం 40 వేల మంది పోలీసులతో భారీ పహారా ఏర్పాటు చేశారు. ఇందులో హైదరాబాద్ పరిధిలో 20 వేల మంది, సైబరాబాద్ రాచకొండ పరిధుల్లో 20 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీ య ఘటనలు జరగకుండా స్థానిక పోలీసులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన బలగాలు, కేంద్ర బలగాలతో బందోబస్తును పటిష్టం చేశారు.గ్రేటర్‌లో 27 అసెంబ్లీ నియోజికవర్గాలు వుండగా ఇందులో 15 హైదరాబాద్ పరిధిలో 12 ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వున్నాయి. అందులో హైదరాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజికవర్గాలు వున్నాయి. అలాగే ఈపార్లమెంట్ పరిధిలో 1500 సున్నిత, అతి సున్నితమైనవిగా పోలింగ్ కేంద్రాలు వున్నాయి. వీటిలో పాతబస్తీలోని చార్మినార్, యాకూత్‌పురా, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట, మలక్‌పే ట్, కార్వాన్, నాంపల్లి, గోషామహల్‌లలో ఎక్కువగా వుండడం గమనార్హం. ఈ ప్రాంతాలలో బందోబస్తు గురించి ఇప్పటికే ఏర్పాట్లు చేయగా ఎన్నికల పరిశీలకులు సైతం ఈ ప్రాంతాలను తనిఖీ చేసి, భద్రత గురించి సూచనలు చేశారు.

**పోలింగ్ కేంద్రాల వద్ద సిసి కెమెరాలు..** పోలింగ్ కేంద్రాలను సిసికెమెరాల నిఘాలోకి తీసుకువచ్చారు. దాదాపు 5వేల సిసికెమెరాలతో పోలింగ్‌ను పర్యవేక్షిస్తారు. 3,783 కేంద్రాల్లో 50నుంచి 100 గజాల లోపు సిసికెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కనెక్ట్ చేశారు. పోలింగ్ సరళిని తెలుసుకునేందుకు ఐటి వింగ్‌ను నియమించారు.

### మన ఓటు ఎవరైనా వేస్తే...

ఓటరు ఓటు వేయడానికి వెళ్లినప్పుడు తనఓటును అప్పటికే ఇంకెవరైనా వేసినట్లు గమనిస్తే అతడు టెండర్డు ఓటు వేయవచ్చు. ఇతడిని నిజమైన ఓటరుగా అక్కడి అధికారి ధృవీకరించుకున్నాక బ్యాలెట్ పత్రాన్ని ఇస్తారు. అయితే ఈవీఎం ద్వారా ఓటు వేసేందుకు మాత్రం అనుమతించరు. టెండరు ఓటును ప్రత్యేకంగా భద్రపరుస్తారు. లెక్కింపులో అభ్యర్థుల మెజారిటీ కంటే టెండర్డ్ ఓట్లు ఎక్కువ వచ్చినప్పుడు మాత్రమే పరిగణంలోకి తీసుకుంటారు.

"ఓటు హక్కు ద్వారా పోరాడి రాజులు అవుతారో, అమ్ముడు పోయి బానిసలవుతారో నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది"-డాక్టర్ బిఆర్ అంబేద్కర్

-"అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు..ఏ పాటి వాడో చూడు. ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు. ఇప్పటిదాకా ఏం చేశాడో చూడు. పెట్టుకునే టోపీ కాదు..పెట్టిన టోపీ చూడు"-కాళోజీ


-"ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాలంటే..ఆ మాట ఇచ్చే ముందు ఆలోచించాలి"-అబ్దుల్ కలాం

నగరంలో ఈసారైనా ఓటింగ్ శాతం పెరుగుతుందా? గత ఎన్నికల ఓటింగ్ సరళిని పరిశీలిస్తోన్న వారిలో నెలకొన్న సందేహం ఇది. ఓటేసేందుకు సోమవారం కార్యాలయాలకు సెలవిచ్చారు. షిఫ్ట్ పద్ధతిలో పనిచేసే సంస్థలు నిబంధనలకు తగినట్లుగా పని గంటలను మార్చుకున్నాయి.మంగళవారం ఒక్కరోజు సెలవు పెట్టుకుంటే శనివారం, ఆదివారం, సోమవారం, మంగళవారం కలిసి వస్తాయని కొందరు టూర్లకు ప్రణాళిక వేసుకోవడం పోలింగ్‌పై ప్రభావం చూపుతుందంటున్నారు. పోలింగ్ రోజు ఇచ్చే సెలవు విలువైందని, దానిని ఓటు వేసేందుకు వినియోగించాలని పలువురు సూచిస్తున్నారు. ఈ మేరకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఎన్నికల సంఘం, ఓటు ఆవశ్యకతను తెలుపుతూ ప్రచారం చేసినా ఓటర్లలో చైతన్యం ఏ మేరకు వచ్చిందనేది సందేహామే.

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గ్రేటర్ పరిధిలోని నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లో నేడు పోలింగు జరగనుంది. అధికారులు దీనికి సర్వసిద్ధం చేశారు. అయితే ఓటరు ఓటు వివరాలు ఎలా తెలుసుకోవాలి ? పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉంటుంది? స్లిప్‌లు ఎలా తీసుకోవాలి? పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాలనే విషయాలు తెలుకోవాల్సి ఉంది. ముఖ్యంగా కొత్తఓటర్లు.. దీనికి సంబంధించిన సవగ్ర వివరాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఎన్నికల సిబ్బంది కొద్దిరోజుల ముందు ఇంటింటికీ వెళ్లి పోలింగ్ స్లిప్పులను అందజేశారు. ఈస్లిప్‌లపై అసెంబ్లీ నియోజకర్గం, పోలింగ్ కేంద్రం, ఓటరు పేరు, చిరునామా, వివరాలుంటాయి. ఈ స్లిప్పులను ఆన్‌లైన్‌లో కూడా పొందే అవకాశం ఉంది. ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ (డబ్లూడబ్లూడబ్లూ.సిఈఓతెలంగాణ.ఎన్‌ఐసి.ఐఎన్)లోకి వెళ్లి" సెర్చ్ యువర్ నేమ్"ఆప్షన్‌పై క్లిక్ చేసి అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఎంచుకోవాలి. నేషనల్ ఓటర్స్ సర్వీస్‌సెస్ పోర్టల్ ట్యాబ్ ఓపెన్ అవుతుంది. అందులో ఓటరు పేరు, తండ్రి పేరు, వయస్సు, రాష్ట్రం, జిల్లా , అసెంబ్లీ నియోజకవర్గం నమోదు చేస్తే ఓటు ప్రాథమిక వివరాలు ప్రత్యక్షమవుతాయి. ఆపై"వ్యూ డిటైల్స్'-ఆప్షన్‌పై క్లిక్ చేయగానే పూర్తివివరాలు కనిపిస్తాయి. దాన్ని ప్రింట్ తీసుకోవచ్చు. స్లిప్పులు అందకపోయినా పోలింగ్ కేంద్రానికి వెళ్లి గుర్తింపు కార్డు చూపించి ఓటేయ్యొచ్చు.

# పోలింగు శాతం పెరిగేనా..?

## సాకులొద్దు.. ఓటు ముద్దు ❖ ఓటింగ్ డే.. నాట్ ఏ హాలిడే



హైదరాబాద్, 12 ప్రభాతవార్త : ఎప్పటిలాగానే నగరంలో చాలా మంది ఓటర్లు సాకులు చెప్పడం ప్రారంభించారు. తమకింకా ఓటరు స్లిప్పులు అందలేదని చెబుతున్న వారు అధిక శాతం ఉన్నారు. చదువు కోని వ్యక్తులు ముందు రోజే పోలింగ్ స్టేషన్ ఎక్కడుందో తెలుసుకుంటుంటే, ఇప్పటికీ తమకింకా స్లిప్పులు అందలేదని విద్యాధికులు ఫిర్యాదులు చేస్తున్నారు. మొబైల్ ఫోన్ లేదంటే ఓటర్ ఐటీ కార్డు నెంబర్, అదీ లేదంటే పేరు, నియోజకవర్గాన్ని బట్టి పోలింగ్‌స్టేషన్ ఎక్కడుందో తెలిపే ఏర్పాట్లు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఉన్నాయి.అయినా కొందరు సాకులు చెపిప పోలింగ్‌కు దూరంగా ఉండడం సరికాదంటూన్నరు. ఎన్నికలతో తమకు పనేం టంటూ కొందరు కుటుంబాలతో ఊర్లు వెళ్తున్నారు. మొత్తంగా గ్రేటర్ పరిధిలోని సికింద్రా బాద్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి ఓటు వేయాలని అధికారులు, పోలీసులు, సెలబ్రిటీలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**యువతా.. నీదే భవితా..**

నగర యువత ఉదాసీనత వీడాలి. బాధ్యతాయుతంగా వ్యవహ రించి ఓటు వేసేందుకు ముందుకు రావాలి. తమ భవితను తీర్చిదిద్దుకునేందుకు ఇదే సరైన సమయం. ఓటుతో తమకేం కావాలో పాలకులకు తెలియ జెప్పాలి. ఈ సాడాది కొత్తగా ఓటు హక్కును పొందిన యువతీ యువకులు లక్షల్లోనే ఉన్నారు. మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, చేవెళ్ల లోక్‌సభ నియోజవకవర్గాల్లో కొత్త ఓటర్లు బాధ్యతగా ఓటు వేస్తే ఈసారి ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగే అవకాశం ఉం టుంది. పార్టీల ఎన్నికల ప్రచారంలో యువకులు పెద్ద సంఖ్యలోనే పాల్గొన్నారు. ఓటింగ్‌లో కూడా అదే విధమైన బాధ్యతను కొనసాగించాలి. కోటిన్నర జనాభా ఉన్న గ్రేటర్ హైదరాబాద్‌లో పోలింగ్ కనీసం 70 శాతం దాటాలంటే యువత బాధ్యతాయు తంగా ఓటేయాలి. 'ఒక్కో సిరా చుక్క..బంగారు భవిష్యత్‌కు చుక్కానిగా నిలిచేలా చైతన్యం కావాల్సి న తరునం ఆసన్నమైంది. రండి..కదలి రండి పోలింగ్ కేంద్రానికి ఉవ్వెత్తున తరలి రండి.. ఓట్ల పండుగలో పాల్గొనండి.




# కరుణించండి..

- ఇష్టదైవాలపై భారం వేసిన అభ్యర్థులు
- ఓటర్లతో పాటు దీవెనలందించాలని పూజలు
- నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ముడుపులు

హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త : ప్రచారం బాగా చేశాం.. కాలికి బలపం కట్టుకున్నట్లుగా ఇంటింటికీ తిరిగినం. డబ్బులు కూడా గట్టిగానే పంచినం. ఇక ఓటర్ల దయ, అంతకంటే ఎక్కువగా నమ్ముకున్న దేవతల దీవెన. గెలుపోటముల బాధ్యత అంతా ఇద్దరిపైనే. నమ్మిన ప్రజలు సోమవారం ఓట్లు వేసి గెలిపిస్తారో.. ఇష్టదైవాలు అండగా నిలుస్తారో లేదో వేచి చూడాలి.. అని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు. పోలింగ్‌కు మరొకిన్ని గంటలు మాత్రమే మిగిలి ఉన్న తరుణంలో ఆదివారం అనుచరులతో కొంతమంది తీవ్ర ఒత్తిడిని వ్యక్తం చేస్తూ మట్లాడడం ఆసక్తికరంగా మారింది. ఎన్నికలను పురస్కరించుకుని గ్రేటర్‌లోని సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గాల్లో టఫ్‌ఫైట్ నడుస్తోంది.

# పద.. పద ఓటేద్దాం



## ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- సమగ్ర సమాచారం కోసం 'నా ఓట్ 'యాప్, ఎన్నికల సంఘం వెబ్‌సైట్
- పోలింగ్ కేంద్రం, సేవలు తెలుసుకునే అవకాశం

✍ ప్రభాతవార్త - హైదరాబాద్

**పోలింగ్ కేంద్రం ఎక్కడా..?..** ఎన్నికల సిబ్బంది పంపిణీ చేసిన స్లిప్పుల వెనక పోలింగ్ కేంద్రానికి సంబంధించిన వివరాలను పొందవచ్చు. గూగుల్ మ్యాప్‌తో పోలింగ్ కే ంద్రాలను అనుసంధానం చేశారు. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో "సెర్చ్ యువర్ నేమ్ "ఆప్షన్‌పై క్లిక్ చేగానే గూగుల్ మ్యాప్ లింక్ ఓపెన్ అవుతుంది. పోలింగ్ కేంద్రం చిరునామా కనిపిస్తుంది. నావిగేషన్‌లో డైరెక్షన్ వస్తాయి.

**ఓటు వేసేందుకు ఏమేం కావాలి**

ఓటు వేసేందుకు గుర్తింపు కార్డు తీసుకెళ్లాలి. ఫొటోతో కూడిన ఓటరు గుర్తింపు కార్డు లేకపోయినా ఇతర గుర్తింపు కార్డులను తీసుకెళ్లవచ్చు. పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, విద్యాసంస్థలు జారీ చేసిన ఫొటోతో కూడిన గుర్తింపు కార్డు,పెన్షన్ పత్రాలు, రేషన్‌కార్డు, బ్యాంక్‌లు లేదా పోస్టాఫీసులు, ఉపాధి హామీ జాబ్ కార్డు, స్వాతంత్య సమరయోధుడి గుర్తింపు కు జారీ చేసిన ఫొటోతో కూడిన గుర్తింపు కార్డు, ఎన్నారైలు అయితే ఒరిజినల్ పాస్‌పోర్టు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అయితే వారి గుర్తింపు కార్డులు.. వంటివి చూపవచ్చు. ఓటరు స్లిప్పు లేకపోయినా పైవాటిలో ఏదేని ఒకటి తీసుకెళ్లవచ్చు. ఇవి ఏవి లేకున్నా ఫొటోతో ఉన్న పోలింగ్ స్లిప్పు.. ఓటరు జాబితాలో పేరుంటే చాలు ఓటు వేసే అవకాశం ఉంటుంది.

**ఫోన్,కెమెరా నిషేదం...** ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, కెమెరాలు, ల్యాప్‌టాప్‌లను తీసుకెళ్లకూడదు. ఇలా ఎవరైనా తీసుకొస్తే పోలీసులు స్వాధీనం చేసుకుంటారు. పోలింగ్ కేంద్రానికి 100మీటర్ల పరిధిలోపు ఫోన్లు వాడకూడదు.

**పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాక**

పోలింగ్ కేంద్రంలో ఒకే వరుసలో కూర్చున్న పోలింగ్ అధికారుల్లో మొదటి అధికారి వద్దకు వెళ్లాలి.వీరు ఓటర్ల జాబితా తనిఖీ అధికారిగా వ్యవహరిస్తారు. ఆయనకు ఓటరు గుర్తింపు కార్డు చూపాలి. కార్డును పరిశీలించిన అధికారి ఓటరుకు సబంధిత పేరు, సీరియల్ నంబర్‌నుపైకి చదువుతారు. అక్కడే ఉన్న వివిధ పార్టీల పోలింగ్ ఏజెంట్లు వారి వద్దఉన్న జాబితాలోని వివరాలను సరిచూసుకుంటారు. పోలింగ్ ఏజెంట్లు అభ్యంతరాలు వ్యక్తం చేయకపోతే అదే వరుసలో ఉన్న మరో అధికారి వద్దకు వెళ్లాలి.ఆయన ఓటరు చూపుడు వేలిపై ఇంకుతో గుర్తు పెడతారు. ఆతర్వాత అక్కడ రిజిస్టరులో ఓటరు సంతకం చేసిన తర్వాత ఓటరు స్లిప్‌ను ఇస్తారు. ఆవరుసలో కూర్చున్న మరో అధికారి ఆస్లిప్పులను తీసుకుని ఈవీఎం కంట్రోల్ యూనిట్‌లో కంట్రోల్ బటన్‌ను నొక్కుతారు. ఓటింగ్ కంపార్టుమెంట్‌లోని బ్యాలెట్ యూనిట్ ఓటింగ్‌కు సిద్ధమవుతుంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో బ్యాలెట్ యూనిట్‌లో మనం ఎంచుకు న్న పార్టీ గుర్తులను చూడాలి. ఈసారి కొత్తగా పార్టీ గుర్తు పక్కన అభ్యర్థి ఫొటో చూసి కూడా ఓటు వేయవచ్చు.పక్కన నీలిరంగు బటన్ నొక్కాలి.బటన్ నొక్కడంతో గుర్తుకు ఎడమవైపున ఉన్న చిన్న బల్బు వెలగంతోపాటు బీఫ్‌మని శబ్దం చేస్తుంది. అంటే ఓటు వినియోగించుకున్నట్లు గుర్తు. ఆవెంటనే బ్యాలెట్ యూనిట్‌కు అనుసంధానంగా ఉన్న వీవీప్యాట్ యంత్రంలో ఓటు వేసిన గుర్తుతో కూడిన స్లిప్పు ఏడు సెక్లతోపాటు ఓటరుకు కనిపిస్తుంది. ఆవెంటనే అది బాక్సులోకి చేరుతుంది. ఆతర్వాత ఓటరు పోలింగ్ కే ంద్రం నుండి బయటకు వెళ్లాల్సి ఉంటుంది.

**వీవీప్యాట్‌లో వేరేది కనిపిస్తే..**

ఓటు వేసిన తర్వాత వీవీప్యాట్‌లో కనిపించే పేపర్ స్లిప్పుల్లో తాను ఎంచుకున్న అభ్యర్థి కాకుండా వేరే అభ ్యర్థికి ఓటు పడినట్లు కనిపిస్తే ఓటరు ఫిర్యాదు చేయవచ్చు.ప్రిసైడింగ్ అధికారి ఓటరుతో మాట్లాడి అదితప్పుడు ఫిర్యాదు అయితే హెచ్చరిస్తారు. నిజమనిపిస్తే ఓటరు నుండి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు తీసుకుని పోలింగ్ ఏజెంటు సమక్షంలో ఓటింగ్ మిషన్‌లో టెస్ట్ నమోదుకు అనుమతిస్తారు. ఓటరు ఫిర్యాదు చేసినట్లుగానే వీవీప్యాట్‌లో నుండి వచ్చే స్లిప్పుల్లో ఓటు వేసిన అభ్యర్థి వివరాలు కాకుండా ఇతర వివరాలు వస్తే వెంటనే పోలింగ్‌ను నిలిపివేస్తారు. ఒకవేళ ఓటరు ఆరోపణ తప్పని తేలితే ఫారం 17లో ఆఓటరు సంతకం తీసుకుని ఓటరును పోలీసులకు అప్పగిస్తారు.

# సమాజం కోసం కష్టపడేవారిని ఓటు వేసి ఎన్నుకోవాలి

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త: దేశం కోసం, సమాజం కోసం కష్టపడేవారిని ఓటు వేసి ఎన్నుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా శంకరమఠ్ ఆలయంలో ఆదిశంకరాచార్యుల ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం అంబర్‌పేటలోని మహంకాళి అమ్మవారిని, సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌ను సందర్శించిన ఆయన సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం బల్కం పేట ఎల్లమ్మ తల్లిని, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లా డుతూ దేశ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, మన దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని, ప్రపంచంలో మన దేశ గౌరవం మరింత పెరగాలని, ఉగ్రవాదం, తీవ్రవాదం లేని శాంతియుత వాతావరణంలో మనమంతా ఆనందంగా ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని, శంకరాచార్యుల వారిని కోరుకుంటున్నానని అన్నారు.

ప్రపంచంలో భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నదని, అమ్మవార్లు, ఆదిశంకరాచార్యుల ఆశీస్సులతో ప్రధాని మోదీ నాయకత్వంలో వచ్చే మూడు సంవత్స రాలలో మన దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందన్న విశ్వాసం నాకుందని తెలిపారు. పోలింగ్‌డేను హాలిడేగా చూడకుండా, దేశంకోసం పనిచేసే వారిని ఓటువేసి ఎన్నుకోవాలని సూచించారు.

# ఓటు మన హక్కు-దేశానికి ఫెస్టివల్ ఆఫ్ డెమోక్రసి'గా పరిగణించి ఓటు వేయాలి

**కార్పొరేటర్ పావనీ వినయకుమార్**

చిక్కడపల్లి, మే 12 ప్రభాతవార్త: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం గాంధీనగర్ కార్పొరేటర్ కార్యాలయంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయకుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలన్నా, మనం కోరుకునే అభివృద్ధికి రేపటితరం వారికి మంచి భవిష్యత్తు నిర్ణయించే గొప్ప అవకాశం ఓటు వేయడం అని అన్నారు. దేశా నికి అతిపెద్ద ఓట్ల పండుగ పార్లమెంట్ ఎన్నికలు, ముఖ్యంగా యువత తప్పకుండా ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకుని తమ సత్తాచాటాలన్నారు. ఎన్నికల రోజు వెకేషన్ డేగా కాకుండా ఓటింగ్‌డేగా పరిగణించాలని, ఇది ప్రతి ఒక్కరికి సంబంధించిన 'ఫెస్టివల్ ఆఫ్ డెమోక్రసీ' అని అన్నారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు సహకరించాలన్న బాధ్యత తీసుకోవాలన్నారు.

